

# మాయ

డోరి మధ్య మాలక్ష్మమ్మవారి చెట్టు కెదురుగుండా సుబ్బయ్య చిల్లర కొట్టు. ఆ చిల్లర కొట్లో ముందుగా కన్పించేది గల్లాపెట్టె. ఆ గల్లాపెట్టె కెదురుగా సుబ్బయ్య నిండైన విగ్రహం. తుమ్మ బెరడులాంటి శరీరంతో నుదుట తిరుమణి తిరుచూర్ణాలు నిలువుగా దిద్దుకుని కూర్చున్నాడు సుబ్బయ్య. సుబ్బయ్యకెదురుగా త్రాసు. అది విచిత్రమైన త్రాసు. దాళా చూపించమని ఎవరూ అడగరు. సిబ్బెలకు అడుగున మైనపు ముద్దలు అతికి ఉన్నాయి. గొలుసులకి ఏవో పసుపు కొమ్ములు గుండ్రాళ్ళు వేలాడగట్టి ఉన్నాయి. దాళా సమంగా ఉన్నట్టు చూపించడానికి ఈ అలంకారాలు అన్నీ, ఇక రాళ్ళ సంగతి సరేసరి, కొన్ని తూనికరాళ్ళు, కొన్ని గుండ్రాళ్ళు. అవేమిటని ఎవరూ అడగరు రాళ్ళ సంగతి అలా ఉండగా గిన్నెలు, డబ్బాలు పడికట్టు కట్టడం సుబ్బయ్యకి

మాత్రమే తెలిసిన విచిత్రమైన కళ. మొగ్గు ఎప్పుడూ గిన్నె వైపే. "ఏమిటి? పెద్దమ్మాయి పురిటికొచ్చినట్టుందే! ఏవిటో నీరసంగా కన్పిస్తున్నారు" అంటూ మాటల్లో పెట్టి పడికట్టు కట్టి ఇవతల పక్క చెంగున తూనికరాయి పెట్టేసేవాడు. వస్తువుల తూకం విషయంలో ఒక్క నూనెబొట్టు కూడా ఎక్కువ జారనిచ్చేవాడు కాదు.

సరుకుల కొచ్చిన జనం ఎక్కువవుతున్న కొద్దీ అష్టావధానం చేసేవాడు సుబ్బయ్య. సరుకులందించే ఇద్దరు కొడుకుల్నీ వూపిరాడనిచ్చేవాడు కాదు. "ఒరే బెల్లం అందుకో! నీ దుంపతెగ, ఆవాలు తీసుకురావటం ఇంత సేపా? శనగ నూనడిగితే నువ్వులనూనె తెచ్చావేంట్రా చవటా" ఇలా శాపనార్థాలతో తరిమేవాడు. పది చేతుల్తో సరుకులు కట్టి ఇరవైనోళ్ళ వచ్చిన వాళ్ళని పలకరించేవాడు. గల్లాపెట్టె నిండుతున్న కొద్దీ సుబ్బయ్యకి ఆవేశం పెరిగేది. కాశీతువ్వాలుతో చమట తుడుచుకుంటూ ముందు అర లాగి చిల్లరంతా తాకేవాడు. హాయిగా వొళ్ళు చల్లగా ఉన్నట్టనిపించేది. రెండోఅర లాగి నోట్లు ముట్టుకునేవాడు. శరీరం గాలిలో తేలిపోతున్నట్లనిపించేది. పక్కనే ఉన్న పద్దు పుస్తకం పట్టుకుంటే ప్రాణం చేతిలోకి వచ్చినట్లుండేది.

మనుషుల ముఖాలు చూడగానే అరువు బేరమో, కాదో తెలిసిపోయేది సుబ్బయ్యకి. అప్పు ముఖాల్ని వెంటనే పట్టించుకునేవాడు కాదు. ఓ వెంకయ్య వచ్చాడనుకోండి.

"సుబ్బయ్యగారూ"

ఆ పిలుపు సుబ్బయ్యకి విన్పించదు.

"వెధవ సచ్చినోడా! ఎన్నిసార్లు చెప్పాల్రా కుంకుడుకాయల సోల తీసెయ్యరా అని."

"సుబ్బయ్యగారూ ...."

"పుల్లమ్మా ..... నీ బేరం కాలేదమ్మా? కొనేది పావలా? మళ్ళీ బెల్లం కొసరు"

"సుబ్బయ్యగారూ ..... "

"పోలీ! ఆ ఉప్పులో చెయ్యి తియ్యి, వచ్చేది లేదు. చచ్చేది లేదు. చస్తున్నాం ఈ చిన్న బేరాల్తోటి?"

"సుబ్బయ్యగారూ...."

అప్పటికి చెవికి సోకుతుంది ఆ పిలుపు. విసుగంతా ముఖానికి పులుముకుని "ఏంటి వెంకయ్యా! చూస్తున్నావుగా! నా కేవన్నా పది చేతులా? చెవులో ఒకటే రొద, ఆ ....... ఏం కావాలో చెప్పు ?"

అప్పటికే సగం చచ్చిపోయిన వెంకయ్య "బియ్యం ....." మాట తుంచేసి "పద్దయితే నా వల్ల కాదయ్యా ......" అని ముఖం తిప్పేసుకుని ఇంకెవరికో సరుకులు కడుతున్నాడు సుబ్బయ్య.

మరికొంత సేపటికి "సుబ్బయ్యగారూ" అన్న పిలుపు.

పద్దుపుస్తకం టాప్పున కొట్టి "నేనెక్కడ చస్తానయ్యా! అప్పులిచ్చి కూర్చుంటే నా కిచ్చేవాడివ్వొద్దూ?" అని గదమాయిస్తాడు.

"ఎక్కడికి పోతానండీ! మా నాయన మీ దగ్గరే పద్దు, నేను మీదగ్గరే .... వూరిడిచిపెట్టి పోతామా?" అని వెంకయ్యంటే "మీరెక్కడికీ పోరండీ! ఇట్లా అప్పులిస్తే నేనే చెంగేసుకుపోవాలి?చెప్పండి ఏంకావాలో" అని ఉద్ధరిస్తున్నట్లు సరుకులు తూస్తాడు. అప్పు కాబట్టి తక్కువ తూచినా పద్దులెక్కువ రాసుకున్నా వెంకయ్య అడగలేడు. అలా మధ్యాహ్నానికి గల్లాపెట్టె బరువు పెరగ్గా, తాళం వేసుకుని కొడుకుని కొట్లో ఉంచి భోజనానికి లేస్తాడు సుబ్బయ్య.

అరవై ఏళ్ళు దగ్గరపడుతున్నా, కూరా పప్పూతో అన్నం తిని ఎరగడు సుబ్బయ్య. వారానికోసారి పప్పు వండించుకుంటే అది జీర్ణ మవడానికి వారమంతా పట్టేది. బతకటానికి పచ్చడి మెతుకులు చాలు అని చిన్నప్పుడు అనుకున్నట్లే ఇప్పుడూ అనుకుంటున్నాడు. ఇంటి కొచ్చినా గల్లా పెట్టె మీదే ధ్యాస. కుర్రసన్యాసి తూకం

సరిగ్గాతూస్తాడోలేదో అని గొంతులో మెతుకులు సమంగా దిగకుండానే పరుగుపరుగున కొట్టుకెళ్ళేవాడు.

రాత్రి ఇంటికొచ్చి డబ్బుసంచీ ఇనప్పెట్టెలో పెట్టి తాకట్టు నగలు తాకి చూసుకుని, ప్రాంసరీ నోట్లని పరామర్శించి, వేసినతాళం ముమ్మారు లాగి అక్కడే పడుకునేవాడు. రాత్రిళ్ళు అన్నం తినటం మాని పదేళ్ళయింది. చిన్నప్పుడు మరమరాలమ్ముకునే తను ఇంతవాడయాడు. పదెకరాల పొలం, రెండిళ్ళు, నలభైవేల రొక్కం, అన్నీ చిల్లరకొట్టు మీదే సంపాదించాడు. పెళ్ళాన్ని కాదుగదా! కొడుకుల్ని కూడా నమ్మకుండా కడుపు కట్టుకు సంపాదించిన సుబ్బయ్యకి ఆఖరి రోజుల్లో ఏం తిన్నా లోపల ఇమిడేది కాదు. ఇంగ్లీషు డాక్టరు ఖరీదని, అరసోలెడు కందిపప్పు ఇచ్చి ఆయుర్వేదం మందు తిన్నాడు. అయినా కుదరలేదు.

ఉపోషాలు చేస్తున్నా, రోగంతో నీరసించిపోతున్నా కొట్టుకు వెళ్ళటం మానలేదు. కొడుకుల్ని నమ్మలేదు. ఓ రాత్రివేళ సుబ్బయ్యకి ఉన్నట్టుండి ఆకలేసింది. పిలిస్తే ఎవరూ పలకలేదు. తనే వంటింట్లో కెళ్ళి గిన్నెలుచూస్తే అక్కడ రెండు కూరలు! పప్పు! వాటిని చూసి సుబ్బయ్యకి వెన్నెముకలో చలి వొచ్చింది. పెళ్ళాం, పిల్లలు ఇవి వండుకు తింటున్నారన్నమాట! కోపంతో ఒణికిపోయాడు. పచ్చడి, చింతపండుచారు తప్ప తెలియని సుబ్బయ్య ఆ కూరలెట్లా ఉంటాయో చూద్దామనుకొన్నాడు. కాని 'ఛీ' అనిపించింది.

"పెళ్ళాం పిల్లలు ! ఛీ ఛీ!" అనుకుంటూ రొప్పుకుంటూ గదిలోకొచ్చి పడ్డాడు.

"పెళ్లాం పిల్లలు మాయ!" అని శాస్త్రుర్లుగారు చెప్పింది జ్ఞాపకం వచ్చింది. సుబ్బయ్య గిజగిజ లాడిపోతున్నాడు. "పెళ్ళాం పిల్లలు మాయ! మాయ! మాయ!" అని గొణుక్కుంటూ డబ్బు సంచులూ, ప్రాంసరీ నోట్లూ గుండెలకి హత్తుకుని ప్రాణాలు విడిచాడు. *